

బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

జూబ్లీహిల్స్, నవంబర్ 18 : తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల నుంచి సుమారు 200 మంది యువకులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ రోజు బీఆర్ఎస్ పార్టీలో ఇంతమంది యువకులు స్వచ్ఛందంగా చేరడానికి కరోనా కష్టకాలంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలేనన్నారు. సొంత కుటుంబం కూడా పట్టించుకోని సమయంలో సీఎం కేసీఆర్ ప్రతి ఒక్క కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, కార్యదర్శి నర్సింగ్‌దాస్, బసవరాజు, లక్ష్మణ్ గౌడ్, రాము గౌడ్, ఇంతియాజ్, నాగరాజు, లడ్డూ, సాయి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## జూలోని జంతువుల దత్తతకు ముందుకు రావాలి

**'కపుచిన్ మంకీ'ని దత్తత తీసుకున్న సిద్ధార్థ్ షా కుటుంబసభ్యులు**



చార్మినార్, నవంబర్ 18 : జంతు జాలాన్ని దత్తత తీసుకోవడానికి జంతు ప్రేమికులతోపాటు నగర పౌరులు ముందుకు రావాలని 'జూ' పార్కు క్యూరేటర్ సునీల్ ఎస్ హిరే మత్ తెలిపారు. జూలో గత నెలలో ప్రజల సందర్శన కోసం ఎన్‌క్లోజర్‌లో విడుదల చేసిన 'కపుచిన్ మంకీ'ని సిద్ధార్థ్ షా కుటుంబసభ్యులు సంవత్సరం పాటు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా క్యూరేటర్ సునీల్ మాట్లాడుతూ.. సిద్ధార్థ్ కుటుంబసభ్యులు క్రమం తప్పకుండా జూలోని జంతువులను సంవత్సరం పాటు దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తున్నారని ప్రశంసించారు. సిద్ధార్థ్ కుటుంబసభ్యుల సహకారం జూ పార్కు ఎప్పటికీ మరువలేనిదని గుర్తు చేశారు. నగర పౌరులతోపాటు కంపెనీల యాజమాన్యాలు, పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలు సైతం జంతు జాలాన్ని దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్ కుటుంబసభ్యులకు క్యూరేటర్ సునీల్ అభినందనలు తెలియజేశారు.

## రమేశ్ జైస్వాల్‌కు 14 రోజుల రిమాండ్

సిటీబ్యూరో, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): నగరంలోని బజార్ ఘాట్ బాలాజీ రెసిడెన్సీ ఓ భవనంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో భవన యజమాని రమేశ్ జైస్వాల్‌ను పోలీసులు అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపర్చారు. విచారించిన న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్‌ను విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు రమేశ్ జైస్వాల్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. నివాస భవనంలో నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు కలిగిన డ్రమ్ములను నిల్వ చేయడం వల్ల జరిగిన ప్రమాదంలో 10 మంది మృత్యువాత పడ్డారు. ఈ సంఘటనకు బాధ్యుడిగా చేస్తూ నాంపల్లి పోలీసులు రమేశ్ జైస్వాల్‌పై కేసు నమోదు చేశారు.



పీర్జాదీగూడలో శనివారం జరిగిన వార్షిక స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో అత్యుత్తమ ప్రదర్శన ప్లేయర్‌ను అభినందిస్తున్న భారత మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి

# అభివృద్ధి, సంక్షేమ వైపే..

# నగర ఓటర్ల మొగ్గు



**కాంగ్రెస్ పార్టీ హామీలను పరిగణనలోకి తీసుకోలేక పోతున్న నగర ప్రజలు**

**మూడోసారి ముచ్చటగా బీఆర్ఎస్ పార్టీదే అధికారం అంటున్న విశ్లేషకులు**



సిటీబ్యూరో, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): నవంబర్ 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మూడోసారి ముచ్చటగా తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. తొమ్మిదేండ్లుగా జిల్లాలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ఇందుకు నిదర్శనం అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, జిల్లాలో దాదాపు 45 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో అధిక సంఖ్యలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన వారే ఉన్నారు. నగరంలోని 15 నియోజక వర్గాలకు చెందిన ఓటర్లు బీఆర్ఎస్‌ను గెలిపించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఫ్లై ఓవర్ల నిర్మాణాలు, స్కైవాక్ నిర్మాణాలు, అండర్ పాసులు వంటి నిర్మాణాలు పూర్తి చేసి నగరంలో పట్టి పీడిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారు. పైగా, ప్రధాన కూడళ్లలో గతంలో అనేక సిగ్నళ్లతో వాహనదారులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఉండేవి. కాని, సర్కారు తీసుకున్న నిర్ణయం వల్ల సిగ్నల్ ఫ్రీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. దీంతో సిగ్నళ్ల వద్ద వెయిటింగ్ లేకుండా వాహనాలు సాఫీగా సాగిపోవడానికి దోహదపడింది. నగర వాసులకు ఆక్సిజన్ కోసం మొక్కలు నాటి, గాలిలో ఆక్సిజన్ స్థాయి పెంచారు. నగరంలో చెత్త సేకరణ కోసం సబ్సిడీతో వాహనాలు పంపిణీ చేశారు. తడి పొడి చెత్త సేకరణ కోసం వేర్వేరుగా బుట్టలు పంపిణీ చేశారు. ఇప్పుడు ప్రతి ఇంట్లో తడి చెత్త, పొడి చెత్త సేకరణకు వేర్వేరుగా బుట్టలు ఉండటం గమనార్హం.

### కనీవిని ఎరుగని సంక్షేమ పథకాలు..

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు కొదవ లేదు. సంక్షేమ పథకాల వల్ల ఎందరో ప్రజలు లబ్ధిదారులుగా మారారు. ఈ క్రమంలో జిల్లాలో సంక్షేమ పథకాల విషయానికొస్తే., 1.32 లక్షల మంది షాదీ ముబారక్ / కల్యాణలక్ష్మి లబ్ధిదారులు ఉన్నారు. అందుకోసం రూ.1134 కోట్లు ప్రభుత్వం నిధులు కేటాయించింది. అలాగే, 2.74 లక్షల మందికి ఆసరా పింఛన్లు ఇచ్చారు. అందుకోసం తొమ్మిదేండ్లలో కూడా రూ.3,150 కోట్ల వరకు నిధులు ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నారు. అలాగే, జిల్లాలో విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేశారు. మనబస్తీ – మనబడి కార్యక్రమం కింద జిల్లాలో రూ.45 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. ప్రైవేటుకు దీటుగా ఆ స్కూళ్లను తీర్చిదిద్దారు. దీంతో ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు విద్యార్థులు జోరుగా వలసలు వచ్చారు. కొనసాగింపుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వేర్వేరుగా గురుకులాలు ఏర్పాటు చేశారు. దళిత బంధు, బీసీలకు ఆర్థిక సాయం వంటి సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయన్న అభిప్రాయాలు స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ హామీలను ఇక్కడ ప్రజలు నమ్మడం లేదు. దీంతో తిరిగి మూడోసారి ముచ్చటగా బీఆర్ఎస్ పార్టీ గెలిస్తే.. కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందన్న అభిప్రాయాలు జోరుగా వ్యక్తమవుతున్నాయి.

## శేరిలింగంపల్లిలో బీజేపీకి భారీ షాక్

- మూకుమ్మడిగా బీజేపీ నేతల రాజీనామాలు
- బీజేపీలో పని చేసే వారికి ప్రాధాన్యం లేదు: మొవ్వ

మియాపూర్, నవంబర్ 18: శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన నియోజకవర్గ, జిల్లా నేతలు పెద్ద ఎత్తున బీజేపీకి రాజీనామా చేశారు. పార్టీ కోసం పని చేసిన తమను ఏమాత్రం పట్టించుకోకుండా సామాజిక న్యాయం పాటించకుండా పూర్తిగా తమకు అన్యాయం చేసిందంటూ మండి పడ్డారు. బీజేపీ వైఖరికి, స్థానిక అభ్యర్థి వైఖరికి నిరసనగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకుడు, ఎమ్మెల్యే టికెట్ ఆశావహుడైన మొవ్వ సత్యనారాయణ తన అనుచరగణంతో మియాపూర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొవ్వ సత్యనారాయణ మాట్లాడుతూ, బీజేపీలో ఎటువంటి సామాజిక న్యాయం జరగడం లేదని, నగరంలో 18 లక్షలకు పైగా కమ్మ సామాజిక వర్గం ఉన్నప్పటికీ ఆ వర్గం నుంచి ఏ ఒక్కరికి కూడా బీజేపీలో టికెట్ కేటాయించలేదన్నారు. నియోజకవర్గంలో ఎంతో వెనుకబడి ఉన్న బీజేపీని బలపరిచేందుకు చాలా కాలంగా తన నేతృత్వంలో కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఎంతో కష్టపడ్డారు. ఆ కష్టాన్ని ఏమాత్రం బీజేపీ నేతలు గుర్తించలేదు. పార్టీ మారి వచ్చిన వ్యక్తికి బీజేపీ టికెట్ ఇచ్చి పార్టీని నమ్ముకున్న మమ్ములను ఎంతో మోసం చేసింది. నియోజకవర్గ టికెట్ ఇచ్చేటప్పుడు తమతో పార్టీ అధిష్ఠానం కనీసం చర్చించలేదు. ఒంటెద్దు పోకడలతో పాటు ఓ ఎంపీ స్థాయి నేత పార్టీని శాసించే రీతిలో వ్యవహరించడం తమను తీవ్రంగా కలచి వేసిందని మొవ్వ సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు అందరి అభ్యర్థన మేరకు ఏ మాత్రం న్యాయం జరగని బీజేపీలో కొనసాగేందుకు సుముఖంగా లేమని, అందుకే మూకుమ్మడిగా బీజేపీకి రాజీనామాలు చేశామన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి అసంతృప్త బీజేపీ శ్రేణులు తమతో నడిచేందుకు సిద్ధంగా ఉన్నారు. అందరితో చర్చించి ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తామని మొవ్వ స్పష్టం చేశారు. కాగా, బీజేపీకి రాజీనామా చేసిన వారిలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే సురేశ్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ ఉపాధ్యక్షుడు డీఎస్ఆర్‌కే ప్రసాద్, స్పోక్స్ పర్సన్ లీలా ప్రసాద్, శేరిలింగంపల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి చిట్టారెడ్డి ప్రసాద్, మాదాపూర్ టీడీపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ తన్నీరు ప్రసాద్, చందానగర్ డివిజన్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శోభా దూబే, కాపు సంఘం అధ్యక్షులు రమేశ్, టీడీపీ, టీఎన్ఎస్ నేతలు భవాని, నవీన్ చౌదరి, మూర్తి, మహిళా అధ్యక్షురాలు సువర్ణ, దుర్గా, పవన్‌కుమార్, కోడెల ప్రసాద్, సత్యనారాయణ, ప్రశాంత్, గిరి, శ్రీధర్, రామసుబ్బారెడ్డి, బాబ్జి ఇతర నేతలున్నారు.



బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

## బ్రాహ్మణ సంఘాల మద్దతు బీఆర్ఎస్‌కే

- మహేశ్వరంలో సబితారెడ్డిని గెలిపిస్తామని సంఘం నాయకుల శపథం
- బడంగ్‌పేట బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 18 : బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేశారని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్‌లో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు. వేద మంత్రాలతో మంత్రికి బ్రాహ్మణ సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘాల నాయకులు ప్రకటించారు. మహేశ్వరం నియోజకవర్గంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గెలిపించుకుంటామని సంఘం నాయకులు శపథం చేశారు. కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపిస్తామన్నారు. గతంలో బ్రాహ్మణులను ఓటు బ్యాంక్‌గా మాత్రమే ఉపయోగించుకున్నారని సంఘం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. బ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా బ్రాహ్మణ పరిషత్‌లను ఏర్పాటు చేశారని ఆమె గుర్తు చేశారు. గతంలో ఎన్నడు అర్చకులకు వేతనాలు ఇవ్వలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణులకు వేతనాలు ఇస్తున్నామన్నారు. కోట్ల రూపాయలతో బ్రాహ్మణ భవనం నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ చైర్మన్ వేణుగోపాల చారి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డి, మహేశ్వరం నియోజక వర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, బ్రాహ్మణ ఐక్య వేదిక అధ్యక్షులు రాఘవ రావు, బ్రాహ్మణ ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, అనురాధ, హనుమంత చారి, శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షులు చక్రవర్తుల జగన్‌మోహన్ చార్యులు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు పెద్ద బావి శోభ ఆనంద్ రెడ్డి, పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి, బ్రాహ్మణ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.